
కైలాసపురం వద్ద గిరి ప్రదక్షిణ రహదారిలో పోటెత్తిన భక్తులు


నరసింహనగర్‌లో భక్తులకు ప్రసాదాలు అందిస్తున్న పీవీఆర్, ఎస్‌డీ సంస్థల యాజమాన్యం


మురళీనగర్-మాధవధార రహదారిలో భక్తులకు ప్రసాదాలు అందిస్తున్న మహిళలు


51వ వార్డులో భక్తులకు ప్రసాదం అందిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ


మురళీనగర్‌లో భక్తులకు ప్రసాదాలు అందిస్తున్న మణికంఠ సేవా సంఘం సభ్యులు

అంతటా అప్పన్న నామస్మరణ

- కోలాహలంగా గిరి ప్రదక్షిణ
- భక్తజన సందోహంతో కిక్కిరిసిన రహదారులు
- భక్తుల సేవలో స్వచ్ఛంధ సంస్థలు
- నడక దారిలో బస్సులు, ఆటోలకు అనుమతి
- ట్రాఫిక్ నియంత్రణలో విఫలమైన పోలీసులు


ఎన్జీజీవోస్ కాలనీ వద్ద రహదారిలో నడుస్తున్న భక్తులు


గిరి ప్రదక్షిణ రహదారిలో భక్తుల మధ్య తిరుగుతున్న సర్వీస్ ఆటోలు

మద్దిపాలెం: గోవిందా గోవిందా.. అప్పన్న.. అప్పన్న అంటూ నారసింహ స్మరణతో సింహాచలం గిరి ప్రదిక్షణకు భక్తులు పోటెత్తారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి గిరి ప్రదక్షిణ రహదారిలో లక్ష్మీనరసింహ స్వామిని స్మరిస్తూ ముందుకు సాగారు. సింహాద్రి అప్పన్నపై అపారమైన నమ్మకంతో.. ఎంతో భక్తిశ్రద్ధలతో ఎన్నెన్నో మొక్కులతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ చేశారు. ఇటు పలాస మొదలుకుని బొబ్బిలి, పార్వతీపురం, విజయనగరం.. అటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి గిరి ప్రదక్షిణ చేయడం కోసం అనేక మంది భక్తులు వచ్చారు. భక్తుల కోసం నియోజకవర్గంలోని సీతమ్మధార, నరసింహనగర్, కైలాసపురం నుంచి మాధవధార మీదుగా ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు పలు స్వచ్ఛంద సంస్థలు అనేక సేవలందిస్తున్నాయి. గిరి ప్రదక్షిణ రహదారిలో స్టాళ్లు ఏర్పాటు చేసి మంచినీరు, టీ, కాఫీ, అల్పాహారం, పులిహోర, చక్కెరపొంగలి, బాదం మిల్క్ పంపిణీ చేశారు. కాళ్ల నొప్పులు రాకుండా మాత్రలు, పెయిన్‌బామ్‌లు భక్తులకు అదించారు. భక్తులు సేద తీరేందుకు టెంట్లు, కుర్చీలు వేసి వైద్య సేవలందించారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తులంతా అప్పన్న నామస్మరణతో సింహగిరి వైపు సాగారు.

భక్తుల మధ్యలో వాహనాల రాకపోకలు

ఓ పక్క గిరి ప్రదక్షిణ పూర్తి చేసేందుకు భక్తులు నడుస్తుంటే.. మరో పక్క అదే రహదారిలో వచ్చే ఆర్టీసీ బస్సులను అనుమతించడం పలువురిని ఇబ్బందులకు గురిచేసింది. రోడ్డు మొత్తం భక్తులతో నిండిన సమయంలో పొరపాటున ఎటువంటి ప్రమాదాలు జరిగినా.. ఎవరు బాధ్యులు అనే ప్రశ్నలు వస్తున్నాయి. లక్షలాది మంది మధ్యలో బస్సులు, సర్వీస్ ఆటోలు తిరుగుతుంటే ఏమరుపాటుతో చూసుకోకపోతే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గిరి ప్రదక్షిణ దారిలో ఎక్కడెక్కడి నుంచో సర్వీసు ఆటోలు రావడంతో ట్రాఫిక్ పోలీసుల వైఫల్యం కళ్లకు కట్టినట్టు కనిపించింది.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ

జీవీఎంసీ 51వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అధ్యక్షతన ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి అందజేశారు. సింహాద్రి అప్పన్న ఆశీస్సులు ఎల్లవేళలా భక్తులపై ఉండాలని ఆకాంక్షించారు. 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి, బి.తిరుమలరావు, పొన్నాడ అప్పారావు, వరలక్ష్మి, రాణి, లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.


మురళీనగర్ వద్ద భక్తులకు ప్రసాదం అందిస్తున్న కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం సభ్యులు

పది వేల మందికి ప్రసాదాల వితరణ

తాటిచెట్లపాలెం: పీవీఆర్ ప్రాజెక్ట్స్, శ్రావణి డెవలపర్స్ ఆధ్వర్యంలో నరసింహనగర్‌లో పది వేల మంది భక్తులకు ప్రసాదాలు వితరణ చేశామని పీవీఆర్ అధినేత పువ్వాడ వెంకటేశ్వర గుప్తా(బుల్లి), శ్రావణి డెవలపర్స్ అధినేత రాజంనాయుడులు తెలిపారు. పదేళ్లగా భక్తులకు ప్రసాదాలు అందిస్తున్నామన్నారు.

మురళీనగర్: మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల్లోని రహదారులు గిరి ప్రదక్షిణ భక్తులతో కిక్కిరిసిపోయాయి. మాధవధార రహదారిలో ఎక్కడ చూసినా భక్తులు సింహాద్రి అప్పన్న నామస్మరణతో నడుస్తూ ఆధ్యాత్మికతను చాటారు. మురళీనగర్-మాధవధార 48 బస్ రూట్‌లో, మురళీనగర్ నుంచి వర్మా కాంప్లెక్స్, అయ్యప్పనగర్, పట్టాభిరెడ్డితోట కూడళ్లలో పలు స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లు, యువజన సంఘాలు భక్తులకు తినుబండారాలు, టిఫిన్‌లు, మంచినీరు, పులిహోర, కూల్ డ్రింక్‌లు, ఎనర్జీ డ్రింక్‌లు పంపిణీ చేశారు. మురళీనగర్‌లో శ్రీమణికంఠ సేవా సంఘం సభ్యులు, వనితా వాకర్స్ క్లబ్, మహిళా వాకర్స్ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందించారు.

కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో..

మహారాణిపేట: డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(1984-87) ఓల్డ్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో అయ్యప్పనగర్ మురళీనగర్ వద్ద సుమారు 20 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఫోరం ప్రతినిధులు సింగూరి నరసింగరావు, భూపతి సత్యనారాయణ, గుండు వెంకటేష్, పట్నాల నాగ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఫోరం సభ్యులు కేత సత్యనారాయణ, పద్మాకర్, కట్టా రమేష్, వి.వి.రాజు, శర్మ, శేఖర్, బిర్లా సన్ లైఫ్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, వాసు, హేమ, శశికళ, సింగూర్ వెంకటరమణ, కృష్ణా కాలేజీ అధ్యాపకులు డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ అరుణ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా అధ్యాపకులను ఫోరం సభ్యులు ఘనంగా సన్మానించారు.

భక్తులకు ప్రసాదాలు అందజేసిన కె.కె.రాజు


సీతమ్మధారలో గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రసాదం అందజేస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా బుధవారం సీతమ్మధారలో సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు భక్తులకు స్వయంగా ప్రసాదాలు, టమాటా బాత్, ఉప్మా, కొమ్ము శెనగలు, మజ్జిగ అన్నం అందించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏర్పాట్ల పరిశీలన


పారిశుధ్య పనులపై సూచనలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: గిరి ప్రదక్షిణ సందర్భంగా 51వ వార్డులో చేసిన ఏర్పాట్లు, శానిటరీ పనులను బుధవారం ఉదయం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ధనాల వెంకటరమణ, సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన టాయిలెట్లు, రోడ్లను పరిశీలించి తగు సూచనలిచ్చారు.

జీవీఎంసీ హైస్కూల్‌కు రెండు అల్మారాల వితరణ


హెచ్ఎం రాధాకుమారికి ఐరన్ అల్మారాలు బహూకరిస్తున్న స్టేట్ బ్యాంక్ అధికారులు

సీతంపేట: సేవా కార్యక్రమాల్లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ 2 అధికారులు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌కు రెండు ఐరన్ అల్మారాలు బహూకరించారు. పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారికి బుధవారం వాటిని అందజేశారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ అశోక్‌కుమార్, బ్రాంచి మేనేజర్ ఎం.మల్లికార్జునరావు, చీఫ్ అసోసియేట్ ఎ.యుగంధర్, ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్భుత రచన కళాపూర్ణోదయం


ప్రసంగిస్తున్న రచయిత డి.వి.సూర్యారావు

సీతంపేట: విజయనగర సామ్రాజ్య కాలం నాటి ప్రబంధాల్లో విశిష్టమైనది పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయం అని రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం కళాపూర్ణోదయంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. సంస్కృత కావ్యాల్లో గాని, ఇతిహాసాల్లో గాని లేకుండా కవి మేధ నుంచి వెలువడిన అద్భుతమైన కల్పన దీని ప్రత్యేకతగా పేర్కొన్నారు. పాత్ర చేత కథ చెప్పించడం, కథలోని సంఘటన పూర్వాపరాలు పాత్రల సంభాషణ ద్వారా వ్యక్తం కావడం ఒక నాటకమో, సినిమాయో చూస్తున్న అనుభూతి కలిగించే అద్భుత రచనగా కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, ద్విభాష్యం రాజేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పట్టాభిరామ్


బి.వి.పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్ట్, కౌన్సిలర్, ఇంద్రజాలికుడు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి సంఘ సేవకుడు భరణికాన రామారావు, సీనియర్ మెజీషియన్ కె.విజయ్‌కుమార్, బాలవికాస్ ఫౌండేషన్ కన్వీనర్ నరవ ప్రకాశరావు, గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి కె.వి.ఎస్.మూర్తి, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరావు తదితరులు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పట్టాభిరామ్‌తో తమకున్న అనుబంధం, అనుభవాలను మిగిలిన వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా భరణికాన రామారావు మాట్లాడుతూ పట్టాభిరామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తనదైన రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందారన్నారు.

పైల దివాకర్‌కు నాయకుల నివాళి



పైల దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్నగుడివాడ్ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ, కె.కె.రాజు, పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్(పీఆర్‌వో)గా, సీనియర్ జర్నలిస్ట్‌గా సేవలందించిన పైల దివాకర్ మృతి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. తాటిచెట్లపాలెంలోని ఆయన నివాసంలో బుధవారం జరిగిన సంస్మరణ సభలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పైల దివాకర్ అత్యంత నిబద్ధతతో, ధైర్యంతో పార్టీ తరఫున మీడియా విధుల్లో కొనసాగారని, విశ్వసనీయతకు ప్రతిరూపంగా, పాత్రికేయ ధర్మాన్ని పాటిస్తూ అంకితభావంతో సేవలందించారని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, శరగడం చిన అప్పలనాయుడు, నాయకులు జాన్‌వెస్లీ, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, మువ్వల సురేష్, పీతల గోవింద్, కిరణ్‌రాజు, ఎండీ షరీఫ్, పైడి రమణ, సనపల రవీంద్రభరత్, సర్వేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కష్టాలు వర్ణనాతీతం

- గిరి ప్రదక్షిణలో దారి పొడవునా అవస్థలు
- అరకొరగా ఏర్పాట్లు, నదుపాయాలు


సీతమ్మధారలో చెట్ల నీడన, ఫుట్‌పాత్‌పై ఆశ్రయం పొందుతున్న గిరి ప్రదక్షిణ భక్తులు


నార్త్ ఎక్స్‌టెన్షన్ వద్ద కల్వర్టు మీద సేదదీరుతున్న భక్తులు


పోర్ట్ స్టేడియం వెనుక వైపు బార్క్ కార్యాలయం వద్ద నేలపైనే కూర్చున్న భక్తులు

తాటిచెట్లపాలెం: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణలో అడుగడుగునా లోటుపాట్లు దర్శనమిచ్చాయి. లక్షల్లో భక్తులు పాల్గొంటారని అంచనా వేసినా జీవీఎంసీ అధికారులు అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయలేకపోయారు. దీంతో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సారి జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది సమ్మె చేయడంతో వారి కొరత కొట్టొచ్చినట్లు కనపడింది. ఈ కారణంగా ప్రైవేటు సిబ్బందిని నియమించి ఈ సేవలను కొనసాగింపచేశారు. వీరు పూర్తిస్థాయిలో సేవలందించలేకపోయారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లపైనే చెత్త పేరుకుపోవడం భక్తులకు కొంత అసౌకర్యంగా మారిది.

కానరాని నీడ.. విశ్రాంతి స్థలాలు

భక్తులు కాలినడకన గిరి ప్రదక్షిణ చేసే సమయంలో అలసట తీర్చుకునేందుకు విశ్రాంతి స్థలాలు, కుర్చీలను ఏర్పాటు చేయాలి. వీటిని అరకొరగా ఏర్పాటు చేయడంతో భక్తులు రోడ్ల మీద, చెట్ల నీడన, కల్వర్టులపైన, పైపుల పైనా, ఆయా కార్యాలయాల ముందు సేదదీరాల్సి వచ్చింది.

చాలీచాలని టాయిలెట్లు..

లక్షల్లో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తుల కోసం చాలా తక్కువ సంఖ్యలోనే టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఉత్తర నియోజకవర్గ పరిధి సీతమ్మధార, నరసింహనగర్, కైలాసపురం, మధుసూదన నగర్ ప్రాంతాల్లో టాయిలెట్లు చాలక భక్తులు బహిరంగ మలమూత్ర విసర్జన చేశారు. కొన్నిచోట్ల టాయిలెట్ల కోసం భక్తులు క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది.

అక్కడ విప్పేసి.. ఇక్కడ కట్టేసి...


ఇనార్బిట్ మాల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ క్లాత్‌ను కట్‌చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు సరిపడా టాయిలెట్లు లేవు. ఉన్న వాటి దగ్గర సరైన మరుగు చోటు లేదు. మహిళలు, పురుషులకు పక్కపక్కనే టాయిలెట్లు ఏర్పాటు చేయడం, కొన్ని చోట్ల పురుషులకో, మహిళలకో కూడా తెలియకుండా టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో గందరగోళం ఏర్పడింది. మధుసూదన నగర్ వద్ద ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన టాయిలెట్లు బహిరంగంగా కనిపించడంతో మహిళలకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో అప్పటికప్పుడు ఇనార్బిట్ మాల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసుకున్న గ్రీన్ క్లాత్‌ను కత్తిరించేసి.. మధుసూదన నగర్‌లో టాయిలెట్స్ వద్ద కట్టించేశారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ తతంగమంతా జోనల్ కమిషనర్, ఏఎంఓహెచ్‌లు చూస్తుండగానే జరిగింది. ముందుగానే ఎందుకు ఇటువంటి ఏర్పాట్లు చేయలేదో వారికే తెలియాలి.


మధుసూదన నగర్‌లో మహిళల టాయ్‌లెట్ల ముందు గ్రీన్ క్లాత్ కదుతున్న జీవీఎంసీ సిబ్బంది

సదా సాయి సేవలో..

- గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైన షిర్డీసాయిబాబా మందిరాలు
- నేడు ప్రత్యేక పూజా, సేవా కార్యక్రమాలు


రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో షిర్డీసాయి

తాటిచెట్లపాలెం: గురుపౌర్ణమి పర్వదిన వేడుకలకు రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం సిద్ధమైంది. 1994లో ఈ మందిరాన్ని ప్రారంభించిన నాటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు ఇక్కడ ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం జరగనున్న ఈ వేడుకలకు ధ్యాన మందిరాన్ని నిర్వాహకులు పెయింటింగ్స్, విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా, సేవా కార్యక్రమాలు, సుమారు 6 వేల మందికి మహా అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు.

గురుపౌర్ణమి పర్వదినాన ప్రత్యేక కార్యక్రమాలు

- గురువారం ఉదయం 8 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో షిర్డీసాయికి క్షీరాభిషేకాలు
- సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం (భజన)
- ఉదయం 11 గంటల నుంచి రాత్రి శేజ్ హారతి వరకు వచ్చిన భక్తులందరికీ ఉచిత అన్నప్రసాదం
- రాత్రి 7 గంటలకు బాబా పల్లకీ సేవ (మహిళలకు ప్రత్యేక అవకాశం)
- షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది, కంకణాలను, కాశీ, హరిద్వారల నుంచి తీసుకువచ్చిన పంచ ముఖ రుద్రాక్షలు భక్తులందరికీ ఉచితంగా పంపిణీ.

గురుపౌర్ణమికి ఆలయాల ముస్తాబు


సీతంపేట: గురుపౌర్ణమి సందర్భంగా షిర్డీసాయినాథుడి ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. సీతంపేట గురుదత్తసాయి ఆలయం, అక్కయ్యపాలెం లలితానగర్ శ్రీలలితా పీఠం, రామకృష్ణానగర్ షిర్డీసాయి ధ్యాన మందిరం, పాలబూత్ సెంటర్ సాయి మందిరం వేడుకలకు సిద్ధమయ్యాయి. లలితా పీఠంలో గురువారం ఉదయం 6:30 గంటలకు లలితా అమ్మవారికి క్షీరాభిషేకం, 10 గంటలకు గురుదత్తాత్రేయ హోమం, సాయి మందిరంలో విశేష అభిషేకం, హారతి కార్యక్రమాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. శ్రీకంఠ గురుదత్త ఆలయంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు గురు హోమం సహిత లక్ష భస్మా(విభూది) అర్చన, 11.30 గంటలకు సాయినాథుడికి అన్నాభిషేకం, సాయంత్రం 7 గంటలకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. రామకృష్ణానగర్ షిర్డీసాయి ధ్యాన మందిరంలో ఉదయం 7 గంటల నుంచి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ జరపనున్నారు.


రైల్వే న్యూకాలనీలో ముస్తాబైన షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం



రామకృష్ణానగర్‌లో ముస్తాబైన షిర్డీసాయి ధ్యాన మందిరం, కొలువైన సాయినాథుడు

మురళీనగర్‌లో గురుపౌర్ణమి పూజలు



మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్.రెడ్డి, ఎస్.వరప్రసాద్ తెలిపారు. శైవాగమ పండితులు అయిలూరి శ్రీనివాస దీక్షితులు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11.30 గంటలకు 108 బిందెల పవిత్ర జలాలతో అభిషేకం చేసి షిర్డీసాయిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తిరువీధి, గురుపాదుక పూజ నిర్వహిస్తారు.

రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా



దొండపర్తిలో డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె సంపత్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్(ఎన్ఎఫ్ఐఆర్) జనరల్ సెక్రటరీ ఎం.రాఘవయ్య పిలుపు మేరకు ధర్నా చేసినట్లు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా, అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో మెమోరండం సమర్పించినట్లు చెప్పారు. శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, రైల్వేల్లో ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను ఆపాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వెంటనే ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నటు తెలిపారు. ఈ మేరకు రైల్వే బోర్డు చైర్మన్‌కు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం ద్వారా మెమోరాండం సమర్పిస్తున్నటు చెప్పారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్‌కు మెమోరండం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆయా బ్రాంచ్‌ల సెక్రటరీలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో పౌర్ణమి ఉత్సవాలు నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాడ పౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే భక్తులు, దాతలు మంగళ ధ్వని, వేద మంత్రోచ్చరణలతో అభిషేక ప్రదర్శన చేస్తారని చెప్పారు. అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు అభిషేకంలో పాల్గొనాలని ఈవో కోరారు.